క్లుప్తంగా

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాలలో విద్యాబోధన సాగుతుందని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో సదర్‌లాండ్ గ్లోబల్ సంస్థవారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 45 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఏడాదికి రూ 2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వేతనంతో సంస్థ విద్యార్థులతో ఒప్పందం చేసుకుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ అభినందించారు.

ప్రజలతో సత్సంబంధాలు అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పడంలో కమ్యూనికేషన్ ఎంతో కీలకమని ఏఎన్‌యూ జర్నలిజం–మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత పేర్కొన్నారు. సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో కార్పొరేట్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఎంబీఏ విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ అనిత మాట్లాడుతూ కమ్యూనికేషన్ అనేది పెద్దకళ అని, ప్రజా సంబంధాలను అభివృద్ధి పర్చడంలో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎంతో అవసరమన్నారు. శ్రద్ధగా వినడం, వినియోగదారుని మనసులో బ్రాండ్ ఇమేజ్ ముద్ర వేయడంతో పాటు విపత్కర పరిస్థితుల్లో సత్వర నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమన్నారు. కార్పొరేట్ ఎథిక్స్‌ను కలిగి ఉండటంతో పాటు చర్యల ద్వారా కంపెనీ ప్రతిష్టను పెంచుకోవడం, సాంకేతిక సామర్థ్యాన్ని కలిగి ఉండటం తప్పనిసరి అని వివరించారు. దూరదర్శన్ ప్రతినిధి రవిశంకర్ మాట్లాడుతూ మీడియా ద్వారా ఆధునిక వ్యాపారం నడుస్తోందని, మీడియాతో సత్సంబంధాలను కలిగి ఉండటం ద్వారా సమాజ పోకడ తెలుస్తుందన్నారు. తద్వారా ఆధునిక వ్యాపార శైలిని అవగాహన చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ రీసెర్చ్ స్కాలర్ ఒలీవ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ గేమ్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సమయానుకూలంగా సంభాషించడం, పద్ధతులను గురించి తెలియజేశారు. ఐక్యూఏసీ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, ఎ.బాజీబాబు, వి.అభిలాష్, ఎస్.మణికంఠ, అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి



నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనలో అందే ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 23 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఏసీపీలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం ఆడిట్‌పై ప్రజావేదిక

తాడికొండ: తాడికొండ మండల పరిధిలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ పూర్తయినందున మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక ఏర్పాటు చేశామని, కావున సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని తెలిపారు.

ప్రజాసంకల్పయాత్ర చారిత్రాత్మకం

- ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన పాదయాత్ర
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు



వైఎస్సార్ సీపీ పొన్నూరు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



పెదనందిపాడులో కేకు కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొన్నూరు: 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 3,648 కిలోమీటర్లు నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పాదయాత్రలో అన్నివర్గాల ప్రజల కష్టాలను తెలుసుకుని, అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు నాంది పలికారన్నారు. ప్రజా సంకల్పయాత్రను ప్రారంభించి ఆరేళ్లు అయిన సందర్భంగా సోమవారం పొన్నూరులో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నేతలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం అయిన తరుణంలో, రాష్ట్రంలో మార్పు కోసం సీఎం వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకమన్నారు. పాదయాత్రలో ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి కష్టాలను తెలుసుకుని ఎన్నికల మేనిఫెస్టోలో నవరత్న పథకాలను ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్నను 2024లో జరిగే ఎన్నికలలో సీఎంగా గెలిపించాలని ప్రజలను కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు మోపర్తి ప్రమీల, గేరా సంజీవ్, దాసరి శివరామకృష్ణ, వెలిచర్ల ప్రసాద్, కందుల సుబ్బారావు, కిలారి శివప్రసాద్, నాగిశెట్టి నరసింహారావు, పిల్లి మాణిక్యరావు, సిద్ధంశెట్టి వెంకటప్పయ్య, అన్నవరపు వినోద్, బోయిన శేషగిరిరావు, సర్పంచులు భవనం వంశీరెడ్డి, జాలాది యానాది రావు, కర్రి రమేష్, మిక్కిలి రామస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి బాటలు..

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఆరు సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా చేబ్రోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి అన్ని వాగ్దానాలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు కాసు ఈశ్వరరెడ్డి, చందు సాంబశివరావు, పెద మస్తాన్, షేక్ జానీ, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు: గత ప్రభుత్వ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కోసం నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయ్యాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాసంకల్పయాత్ర మొదలు పెట్టి ఆరు సంవత్సరాలు అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఖాశింపీరా మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని వారి చల్లని దీవెనలతో అఖండ మెజార్టీతో గెలిచి ప్రజల కోసం నవరత్నాలకు ప్రకటించి అందరికీ వాటిని చేరేలా చేస్తూ, పేద ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తపిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ రాబోయే ఎన్నికల్లో సైతం రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేలా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు, పెదనందిపాడు, కొప్పర్రు, గోగులమూడి సర్పంచ్‌లు దాసరి పద్మారావు, సాతులూరి సురేష్, చెన్నుపాటి నరసింహారావు, వైస్ సర్పంచ్ దివ్వి రాంబాబు, ఏబీపాలెం, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షుడు కూరేటి భూషయ్య, దివ్వి నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ రవి, సచివాలయాల కన్వీనర్ బి.కిషోర్, కట్టా సునీల్, కారుమూరి పుష్పరాజ్, అల్లడి వెంకటేశ్వర్లు, గద్దె చెంచురామారావు, మొవ్వా శ్రీనివాసరావు, జెట్టి శ్రీనివాసరావు, సుబ్బారావు, గొట్టిముక్కల వెంకట సుబ్బారావు, ధూళిపాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేకతోటి దయాసాగర్

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగనన్న ప్రజా సంకల్ప యాత్ర, పాదయాత్ర చేపట్టి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, మండల కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, చైర్మన్‌లు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



పెదకాకాని: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అక్రమంగా షెడ్డు ఏర్పాటు చేస్తుండటంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్న సంఘటన సోమవారం పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామంలోని భ్రమరాంబపురం కాలనీలోనికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి సమీపంలో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్డు ఏర్పాటు పనులు చేపట్టారు. అక్రమంగా షెడ్డు నిర్మిస్తుండడంతో స్థానికులు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న షెడ్డును తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక్కరోజు గడువులో తొలగిస్తానని సంబంధిత వ్యక్తులు కోరడంతో పనులు నిలిపివేసి రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న వారిలో వీఆర్‌ఓలు మహేష్, శ్రీనివాసరావు, నరసింహారావు ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పాత గుంటూరు: మంగళదాస్‌నగర్ మెయిన్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గుంటూరు నగర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ అధ్యక్షుడిగా గోపవరపు శివ సత్యనారాయణ గుప్త, ఉపాధ్యక్షులుగా మాజేటి రామారావు, చింతా నాగేశ్వరరావు, వనమా నరేంద్ర, కార్యదర్శి పోలిశెట్టి రామకిషోర్, కోశాధికారిగా కట్టమూరి రవి, సహాయ కార్యదర్శులు మద్దు సాంబశివరావు, మిరియాల వెంకటేష్, సంపత్‌కుమార్, సభ్యులచే ఎమ్మెల్యే ముస్తఫా ప్రమాణం చేయించారు. అతిథులు మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నగర యువత అధ్యక్షుడు గర్లపాటి రవికిరణ్, గుంటూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

మెట్టపైరుకు జీవం



పెదకాకాని- గోళ్లమూడి రోడ్డులో నిండుకుండలా ప్రవహిస్తున్న గుంటూరు ఛానల్



పచ్చదనంతో చూడ ముచ్చటగా వరి పొలాలు

- వర్షంతో నిండుకుండలా గుంటూరు ఛానల్
- కళకళలాడుతున్న వరి, ఇతర పంటలు

పెదకాకాని: రెండు నెలలుగా రైతాంగం అంతా ఆశగా ఎదురు చూస్తున్న వేళ ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో మెట్ట పైర్లకు ప్రాణం పోసినట్లయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సాగవుతున్న వరి పైరు కూడా పచ్చదనంతో కళకళలాడుతుంది. పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాలలో వరి, మిరప, పత్తి, మినుము పంటలను పంట కాలువల ద్వారా పారుదల అవుతున్న నీటిని సద్వినియోగం చేసుకుని సాగు చేస్తున్నారు. అయితే ఇటీవల కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మెట్ట పైర్లు సాగు చేస్తున్న రైతులు ఒకింత ఆందోళన చెందారు. వర్షం ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూడసాగారు. ఈ వర్షాభావ పరిస్థితుల్లో మెట్ట పైర్లు సాగు చేపట్టిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ దశలో కురిసిన వర్షం మెట్ట పైర్లకు జీవం పోసినట్లయింది. మండలంలో సుమారు 14,000 ఎకరాల్లో పంటలు సాగులో ఉండగా 11,642 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అలాగే మిరప 884 ఎకరాల్లోను, పత్తి 402 ఎకరాల్లోనూ సాగు చేయడంతో పాటు మినుము, వేరుశనగ, కూరగాయలు సాగు చేస్తున్నారు. గత 15 రోజులుగా ఎండల ప్రభావం పెరగడంతో మెట్ట పంట సాగు చేపట్టిన రైతులు పంటను కాపాడుకునేందుకు సమీపంలోని చెరువులు, కుంటలు, బోర్ల నుంచి నీళ్లు పెట్టుకునే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా మిరప పైరును కాపాడుకునేందుకు మొక్కదశలోనే నీరు పెడుతున్నారు. ఈ దశలో వర్షం కురవడంతో మెట్ట రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కళకళలాడుతున్న మిరప పైరు

బలమైన సంకల్పం.. ఆలోచన దివ్యం

- తీవ్ర మధుమేహంతో కాలు కోల్పోయిన పొన్నూరు మండలం ఆలూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి
- గుండె సంబంధిత సమస్యతోనూ బాధపడుతున్న వైనం
- గుర్తించి చలించిన బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- జైపూర్ పాదాలు చేయించి, స్వయంగా తొడిగి నడిపించిన వైనం



బాబావలిని నడిపిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం, ఆలూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి అదుపు తప్పిన మధుమేహంతో తీవ్ర అనారోగ్యం పాలై చివరకు తన కుడి కాలును నడుము కింది వరకు కోల్పోయి దివ్యాంగుడిగా మారాడు. తీవ్ర నైరాశ్యంతో బతుకుబండిని ఈడుస్తున్నాడు. బజరంగ్ ఫౌండేషన్ నేతృత్వంలో ఇటీవల కట్టింపూడి గ్రామంలో చేపట్టిన మీ గుండె పదిలం కార్యక్రమానికి హాజరైన బాబావలి పరిస్థితిని చూసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చలించిపోయారు. ఈ వైకల్యం చాలదన్నట్లు మరోవైపు బాబావలి గుండెలో బ్లాక్ ఏర్పడి స్టంట్ వేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు వైద్య శిబిరంలో నిర్ధారణ అయింది. ఇదంతా చూసిన అంబటి మురళీకృష్ణ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బాబావలిని ఈ అనారోగ్య సుడిగుండం నుంచి బయటపడేయాలని బలమైన సంకల్పం తీసుకున్న మురళీకృష్ణ బజరంగ్ ఫౌండేషన్ 'మీ గుండె పదిలం' ద్వారా అతనికి అందాల్సిన గుండె వైద్యాన్ని ఓ వైపు కొనసాగిస్తూనే, మరోవైపు జైపూర్ పాదాల తయారీకి సిద్ధమయ్యారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేకమైన కొలతలతో బాబావలి కోసం రూపొందించిన జైపూర్ పాదాలతో సోమవారం ఆలూరు గ్రామంలోని బాబావలి నివాసానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మురళీకృష్ణ జైపూర్ పాదాలను బాబావలికి అందజేసి, తొడిగిన పాదంతో నడిపించి ప్రోత్సహించారు. బజరంగ్ ఫౌండేషన్ తరఫున అతని ఇంటిలో ఒక వెస్టర్న్ కమోడ్‌ను నిర్మించి ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా నడక తర్ఫీదు అయిన వెంటనే విజయవాడకు తీసుకువెళ్లి స్టంట్ వేయాలని నిర్ణయించారు.

పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్



పాఠశాలలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నిడుముక్కల(తాడికొండ): తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ ఆవరణలో ఉన్న మొక్కలను తొలగించి ఊడ్చి పరిశుభ్రం చేశారు. త్వరలో మొక్కలు నాటనున్న నేపథ్యంలో స్థలాన్ని ఎంపిక చేసి చదును చేశారు. పలువురు గ్రామస్తులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



మాట్లాడుతున్న యార్డు చైర్మన్ నిమ్మకాయల

కొరిటెపాడు(గుంటూరు): విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ హెచ్చరించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో యార్డులో పనిచేస్తున్న వేమెన్స్‌తో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రైతులకు గానీ నష్టం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న లోపాలు ఉంటే సవరించుకోవాలని కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి యార్డుకు వచ్చే మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలన్నారు. వేమెన్స్ వారికి కేటాయించిన మిర్చి కమీషన్ షాపులలో అందుబాటులో ఉంటూ నమ్మకంతో పనిచేయాలని సూచించారు. నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి, మార్కెట్ యార్డుకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి, యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి, వేమెన్స్ పాల్గొన్నారు.

82 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ, 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు పి.ఎస్తేరు రాణి శిబిరంలో 82మందికి వైద్యపరీక్షలు చేశారు. అందులో 40మందికి బీపీ, షుగర్ ఉన్న వారికి రక్త, మూత్ర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. సీహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.

బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్

మంగళగిరి: బీఎల్వోలు మరోసారి ఓటర్ల జాబితాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నూతన జాబితాలతో ప్రతి బీఎల్‌వో క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్లను విచారించి తమ ఓటులో ఏమైనా తప్పులుంటే సరిదిద్దేలా చూడాలన్నారు. అంతేకాక 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఒకే డోర్ నెంబర్‌లో అధిక ఓటర్లుతో పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్‌వో లక్ష్మీకుమారి, అసిస్టెంట్ ఈఆర్‌వో కె హేమమాలిని పాల్గొన్నారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ బి.బాబురావు సోమవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన శుక్రవారం జరిగే చేబ్రోలు మండల సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ బాబురావు కోరారు.